క్లుప్తంగా

ఈత చెట్ల లెక్కింపు



లెక్కిస్తున్న అధికారులు

ముధోల్: మండలంలోని రువ్వి గ్రామంలో శనివారం ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో ఈత చెట్ల లెక్కింపు చేపట్టారు. 382 ఈత చెట్లను గుర్తించినట్లు భైంసా ఆబ్కారీ శాఖ సీఐ నజీర్ హుస్సేన్ తెలిపారు. ఆబ్కారీ శాఖ ఎస్సై ప్రణీత్, రవీందర్, దత్తరం, సర్పంచ్ గౌతమ్, సిబ్బంది ఉన్నారు.

'డబుల్ బెడ్రూం'లు పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా గల డబుల్ బెడ్రూం ఇళ్లను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం పరిశీలించారు. గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా శానిటేషన్ చేయిస్తామన్నారు. కౌన్సిలర్లు సాజిద్‌ఖాన్, అన్వర్ పాషా, ముజాయిద్, కాలనీవాసులు ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

తానూరు: ముంపునకు గురైన బోల్సా గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను డీఎల్‌పీవో శివకృష్ణ శనివారం పరిశీలించారు. వరద కారణంగా గ్రామంలో కొట్టుకువచ్చిన చెత్తను కార్మికుల ద్వారా తొలగింపజేశారు. ఆయా వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డ్రెయినేజీలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని డీఎల్‌పీవో పరిశీలించారు. సూపర్‌వైజర్ అబ్దుల్ ఖాసీం, ఆర్‌ఐ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి గోపినాథ్ ఉన్నారు.

గౌడ మహాసభలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నర్సాగౌడ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆగస్టు రెండో వారంలో నిర్వహించే గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని టీజీఎస్–జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శనివారం ఆయన మాట్లాడారు. మోకుదెబ్బ ఏర్పడి 25 ఏళ్లవుతున్నా సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా జాతీయ సెక్రెటరీ జనరల్ సిద్ధిరాములుగౌడ్, జాతీయ అధికార ప్రతినిధి, హైకోర్టు న్యాయవాది సురేష్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. గౌడ కులస్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్మికుల వంటావార్పు



రోడ్డుపై భోజనం చేస్తున్న కార్మికులు

ముధోల్: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. మండల కేంద్రంలో రోడ్డుపై శనివారం కార్మికులు వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపైనే భోజనం చేసి నిరసన తెలిపారు.

వైద్యశిబిరం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలోని ఒడ్డెర కాలనీలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్నవారికి మండల ఆరోగ్య కార్యకర్త శివక్రిష్ణ రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. దోమకాటు బారినపడకుండా ఉండేందుకు ప్రజలు దోమతెరలు వినియోగించాలని సూచించారు.



భైంసా రూరల్: పీరీలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



లోకేశ్వరం: వట్టోలిలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు



నర్సాపూర్(జి): పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మొహర్రం వేడుకలను జిల్లాలో భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. సవారీల (పీరీలు)ను ఊరేగింపు చేపట్టారు. అనంతరం పీరీలకు భక్తులు పూలదండ వేసి మలీద ముద్దలు, కుడకలు, షర్బత్‌ను నైవేద్యంగా సమర్పించారు. అగ్ని గుండం చుట్టూ భక్తులకు కాళ్లకు గజ్జలు కట్టుకుని దప్పుచప్పుళ్ల మధ్య అసైదుల్లా అంటూ ఆడిపాడారు. ప్రజలు కులమతాలకు అతీతంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నిర్మల్‌లోని పంజేషగల్లిలో పీర్లను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. **– సాక్షి నెట్‌వర్క్**



నిర్మల్‌టౌన్: పీర్లను దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ నేత జాన్సన్‌నాయక్



లక్ష్మణచాంద: అసైదూల్లా ఆడుతున్న యువకులు



మునిపెల్లిలో అగ్ని గుండంలో వెళున్న భక్తులు

నిండుకుండలా చెరువులు

లక్ష్మణచాంద: మండలం పచ్చదనంతో పరుచుకుంది. కురిసిన భారీ వర్షాలకు వాగులు, ఒర్రెలు పొంగడంతో చెరువులు నిండుకుండలా మారాయి. లక్ష్మణచాంద ఊర, హకీం చెరువుల అలుగు దూకి పారుతోంది. చింతల్‌చాంద చెక్‌డ్యామ్ ప్రజలకు కనువిందు చేస్తోంది. న్యూ కంజర్ సమీపంలో రోడ్డు పక్కనే గల కొబ్బరి చెట్టు ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రకృతి అందాలను మండల వాసులు ఆస్వాదిస్తూ వాటిని సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.



నిండుకుండలా లక్ష్మణచాంద ఊర చెరువు

చెరువుకు జలకళ

కుంటాల: ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని కల్లూర్ ఎర్రకుంట చెరువు శనివారం ఒకే రోజు నిండింది. దీంతో చెరువు జలకళ సంతరించుకుంది.



చెరువు ఆక్రమణపై విచారణ చేయాలి

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో గల కప్పలకుంట చెరువు ఆక్రమణపై విచారణ చేయాలని మత్స్య పారిశ్రామిక సంఘం పట్టణ అధ్యక్షుడు సురేష్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. పట్టణంలో అధిక వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టను శనివారం పరిశీలించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల చెరువు శిఖాన్ని ఆక్రమించి లేఅవుట్ వేయడంతో అలుగు నిండి కట్ట తెగిపోయిందన్నారు. దీంతో లక్షల విలువైన 10 టన్నుల చేపలు వెళ్లిపోయాయన్నారు. గతేడాది ఇదే తరహాలో చెరువు తెగిపోవడంతో మత్స్యకారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే మత్స్యకారులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, కౌన్సిలర్ శ్రీనివాస్ ఉన్నారు.



తెగిపోయిన చెరువును చూపిస్తున్న నాయకులు

రైతుల ఆకాంక్షకు కట్టుబడి ఉంటాం

- బీఆర్‌ఎస్ నేతలు

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటవుతున్న ఇథనాల్ కర్మాగారాన్ని ఆపివేయాలంటూ మండల రైతుల నుంచి వస్తున్న తీవ్ర ఒత్తిడితో నాయకులు కదులుతున్నారు. వారి ఆకాంక్షలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తున్నారు. శనివారం బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు, రైతులతో కలిసి కర్మాగార స్థలాన్ని పరిశీలించారు. ఇథనాల్ కర్మాగార నిర్మాణంతో స్థానిక రైతులు, ప్రజలకు ఎలాంటి దుష్పరిణామాలు ఎదురవుతాయోనని వాపోయారు. నిర్మల్ ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత రాంకిషన్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి ఐకేరెడ్డి ఆదేశాలతో ఇథనాల్ కర్మాగార నిర్మాణ స్థలాన్ని రైతులతో కలిసి పరిశీలించామన్నారు. కర్మాగారం నిర్మాణం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తితే దీన్ని ఆపివేయిస్తామన్నారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, నాయకులు చిన్నారెడ్డి, శ్రీనివాస్, సాయన్న, గుణవంత్‌రావు, రాజారెడ్డి, నర్సారెడ్డి, గంగారెడ్డి, గుణవంత్‌రావు, గంగాధర్, నర్సయ్య, రవి, నవీన్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రాంకిషన్‌రెడ్డి

అనుమతులపై సమాధానం చెప్పాలి

దిలావర్‌పూర్ గుండంపల్లి గ్రామాల మధ్య దాదాపు 40 ఎకరాలు కొనుగోలు చేసి అన్ని అనుమతులు పొంది ఇథనాల్ కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తున్నా స్థానిక అధికార పార్టీ నాయకులు ప్రజల గోడును వినడం లేదంటూ గుండంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గజేందర్ ఆరోపించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా అనుమతి ఇచ్చాయని, దీనిపై స్థానిక నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కంటితుడుపు చర్యగా ఎన్నికల వరకు ఆపుదామని రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.

ముంపు బాధితులను ఆదుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి

తానూరు: భారీ వర్షం, వరదల కారణంగా నష్టపోయిన ముంపు బాధితులు, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి డిమాండ్ చేశారు. మండలంలో బోల్సా, హిప్నెల్లి గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. బోల్సా గ్రామంలో ముంపునకు గురైన బాధితులతో మాట్లాడారు. వారిని ఆదుకుని వారికి అవాసం కలిగించేలా చూడాలన్నారు. హిప్నెల్లిలో తెగిపోయిన చెరువు కట్టను పరిశీలించి చేన్లలో కొట్టుకువచ్చిన మట్టిబెడ్డలను పరిశీలించారు. ప్రభుత్వం సర్వే నిర్వహించి రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ శామ్‌రావ్ పటేల్, నాయకులు స్వామి తదితరులు ఉన్నారు.



బోల్సాలో గ్రామస్తులతో మాట్లాడుతున్న రమాదేవి

దెబ్బతిన్న రోడ్లు పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాలు సుభాష్‌నగర్, జేకేనగర్, రాజీవ్‌నగర్, అంబేద్కర్‌నగర్, శాంతినగర్ కాలనీల్లో శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ పూర్ణచందర్‌నాయక్ పర్యటించారు. కాలనీల్లో దెబ్బతిన్న రోడ్లు, ఇళ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీఇచ్చారు.



పరిశీలిస్తున్న పూర్ణచందర్‌నాయక్

పంట పరిహారం చెల్లించాలి

సోన్: వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గాంధీనగర్, సాకేరా గ్రామాల్లో శనివారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, నవీన్, పోశెట్టి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట పరిశీలన

తానూరు: మండలంలోని హిప్నెల్లి సమీపంలోని చెరువు కట్ట భారీ వరదకు కొట్టుకుపోయింది. శనివారం చెరువు కట్టను మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న పరిశీలించారు. సర్పంచ్ శ్యామ్ పటేల్, రైతులు లక్ష్మణ్, సాయినాథ్, శివరాం తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన రమేశ్‌రావు ఇటీవల మృతి చెందాడు. ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావుపటేల్ వేర్వేరుగా శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు రమేశ్, భీంరావు, చిన్నారెడ్డి, నర్సింగ్‌రావు, వెంగళ్‌రావు, గంగాధర్, నవీన్, రాజేందర్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన పోషన్న అనారోగ్యంతో, వడ్యాల్‌లో ముత్తన్న గుండెపోటుతో మృతిచెందారు. బాధిత కుటుంబీకులను కాంగ్రెస్ జిల్లా నాయకుడు కూచాడి శ్రీహరిరావు శనివారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజేశ్వర్, రాంరెడ్డి, అరవిందర్‌రెడ్డి, శ్రీనివాస్, రవి ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ పటేల్, బాయమొల్ల లచ్చన్న, కిష్టాపూర్ గ్రామానికి చెందిన పుల్లపు ముత్తన్న, కోతుల్‌గాం సుశీల, ధర్మోర గ్రామానికి చెందిన మామిడి నారాయణ్‌రెడ్డిల కుటుంబాలను నాయకులు శనివారం పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావ్ పటేల్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబు, మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నకర్‌రావు, బీఆర్‌ఎస్ కన్వీనర్ శ్యాంసుందర్ ఉన్నారు.

పంటలకు తీరని నష్టం

- భారీ వర్షాలకు పోటెత్తిన వరద
- నీటమునిగిన పంటలు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

మామడ: కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, పొంగులు, ఒర్రెలు పొంగుతున్నాయి. వరద పోటెత్తడంతో సమీప పంటలు నీట మునిగి కొట్టుకుపోయాయి. మండలంలో కొన్నిచోట్ల చేలల్లో నీరు నిలవగా, మరికొన్నిచోట్ల పత్తి మొక్కలు తడిసి పనికి రాకుండా పోయాయి. దెబ్బతిన్న పంటలతో గ్రామాల రైతులు ఆర్థికంగా నష్టపోయారు. గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. విత్తనాలు నాటి నెల రోజులు కాకముందే భారీ వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని 27 పంచాయతీల పరిధిలో రైతులు పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, వరి, పసుపు, కంది పంటలు సాగు చేశారు. గుట్టల మీది గ్రామాలైన తాండ్ర, గాయిద్‌పల్లి, మొండిగుట్ట, వాస్తాపూర్ గ్రామాల పరిధిలో సోయాబీన్, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. గోదావరి పరీవాహక గ్రామాలైన కమల్‌కోట్, పొన్కల్, నల్దుర్తి పరిధిలో మొక్కజొన్న, పసుపు పంటల్లో వర్షపు నీరు చేరింది. మామడ, దిమ్మదుర్తి, అనంతపేట్, పోతారం, కొరిటికల్, పరిమండల్, కిషన్‌రావ్‌పేట్ గ్రామాల్లో చేన్లు కోతకు గురయ్యాయి. వ్యవసాయశాఖ అధికారులు పంటలను పరిశీలించి నష్టంపై అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని గ్రామాల రైతులు కోరుతున్నారు.

1930 ఎకరాల నష్టం

మండలంలో మొత్తం 1930 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. పత్తి 1226 ఎకరాలు, సోయాబీన్ 226 ఎకరాలు, వరి 21 ఎకరాలు, పసుపు 101 ఎకరాలు, కంది 97 ఎకరాలు, మొక్కజొన్న 259 ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తించారు.



తాండ్రలో దెబ్బతిన్న సోయాబీన్ వద్ద బాధిత రైతు

ఆదుకోవాలి



నేను నాలుగెకరాల్లో పత్తి, సోయాబీన్ సాగు చేశాను. వర్షాలకు చేన్లు కోతకు గురయ్యాయి. పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– మహేష్, రైతు,తాండ్ర

ఉన్నతాధికారుల దృష్టికి



వర్షాల నేపథ్యంలో మండలంలో జరిగిన పంట నష్టంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పత్తి, సోయాబీన్, పసుపు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. గ్రామాల్లో జరిగిన పంట నష్టాన్ని గుర్తించాం.

– నాగరాజు, ఏవో, మామడ

ప్రమాదకరంగా మలక్‌చించోలి వంతెన



కోతకు గురైన మలక్‌చించోలి వంతెన

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి సమీపంలో స్వర్ణ నదిపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఒకవైపు కింది భాగంలో సగం వరకు కోతకు గురై రోడ్డు కిందివైపు మట్టి మొత్తం కొట్టుకుపోయింది. ఈప్రదేశం మీదుగా బరువైన వాహనాలు వెళ్తే అందులో పడిపోయి ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయి.

కూలిన వంతెన

లక్ష్మణచాంద: భారీ వర్షాలకు మండలంలోని పీచర సమీపంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో శనివారం వంతెన కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ వంతెనను పరిశీలించారు. పీచర, ధర్మారం గ్రామాల నుంచి సోన్ మండల కేంద్రానికి వెళ్లేందుకు రాకపోకల చేయొద్దని ఎస్సై సూచించారు.



కూలిన వంతెన వద్ద ఎస్సై శ్రీకాంత్

వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు



దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రోడ్డు

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో భారీ వర్షాలకు రోడ్ల అధ్వానంగా మారింది. దిలావర్‌పూర్ నుంచి గుండంపల్లి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. తాజాగా శనివారం వరద ఉధృతి తగ్గిపోవడంతో రోడ్డును చూస్తే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మాయాపూర్ గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నీట మునిగిన వైకుంఠధామం



వైకుంఠధామం ఇదీ

లక్ష్మణచాంద: భారీ వర్షాలకు మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామ ఊర చెరువు నిండింది. దీంతో వైకుంఠధామం, క్రీడాప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్లు నీటిలో మునిగిపోయాయి. అధికారులు ముందుచూపు లేకనే అన్ని చెరువులో నిర్మించడం వల్ల నీట మునిగాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

మిస్సింగ్ కేసు

నిర్మల్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైందని సీఐ పురుషోత్తం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఖానాపూర్ మండలంలోని రాజూరా గ్రామానికి చెందిన మహేశ్వర్‌నాయక్(18) అనే యువకుడు సోదరి అనారోగ్యంగా ఉండడంతో నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. శనివారం ఉదయం 7 గంటలకు ఆసుపత్రి నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కాలువ పనులు పూర్తిచేయాలి

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్‌లోని సదర్మాట్ కాలువ వద్ద జరుగుతున్న యూటీ పనులు వేగంగా పూర్తిచేయాలని సదర్మాట్ రైతు నాయకులు దూల్లే వెంకటేశ్, అంకంపాట గంగాధర్, జాడి గంగాధర్ అన్నారు. శనివారం యూటీ పనులను పరిశీలించారు. రైతులు తదితరులు ఉన్నారు.